
# 1/70కి మరో గండం

**1/70ని సవరించేందుకు ఈసారి శాసనసభా కమిటీయే పూనుకుంది. 'గిరిజనేతరుల ప్రయోజనాలకు ఆటంకం కలగకుండా గిరిజనుల హక్కుల్ని కాపాడడం ఎలా' అనే అసాధ్యమైన అంశం మీద అది ఒక నివేదిక సమర్పించింది. దీనిలో లేని సామాజిక న్యాయాన్ని ఉన్న, గిరిజనేతర పక్షపాతాన్ని వివరించే వ్యాసం ఇది.**

పశ్చిమగోదావరి జిల్లాలోని మూడు ఏజెన్సీ మండలాలలోనూ వాటిని ఆనుకొని ఉన్న ఖమ్మం జిల్లా దమ్మపేట, అశ్వరావుపేట మండలాలలోనూ 'తీవ్రరూపం తీసుకుంది' అని అందరూ ఒప్పుకుంటున్న గిరిజన-గిరిజనేతర భూమి సంబంధమైన ఘర్షణల నేపథ్యంలో మన రాష్ట్ర అసెంబ్లీ ఒక సభాసంఘాన్ని నియమించింది. 304 నియమం కింద పువ్వాడ నాగేశ్వరరావు తదితరులు ఇచ్చిన నోటీసుననుసరించి 1998 జూలై 24న సభలో జరిగిన చర్చలో భాగంగా, అన్ని పార్టీలకు చెందిన శాసనసభ్యులూ ఒక సభా కమిటీని వేసి విషయాన్ని లోతుగా పరిశీలించాలని కోరిన మీదట 21



మంది సభ్యులతో కూడిన ఈ సభాసంఘాన్ని నియమించడం జరిగిందంట.

(i)రెగ్యులేషన్ 1/70 నిర్దేశించిన నియమాల నేపథ్యంలో భూమి బదలాయింపుకు సంబంధించి ఉత్పన్నం అయిన గిరిజన- గిరిజనేతర సమస్యల తాలూకు అన్ని కోణాలనూ పరిశీలించి ఆ రెగ్యులేషన్‌లోని లోటుపాట్లను పూరించడం; (ఈ డొంకతిరుగుడు భాష రాష్ట్ర అసెంబ్లీ సెక్రెటేరియట్ పండితులది. దానికి దయచేసి మమ్మల్ని నిందించవద్దు. అయితే ఇది భాషాపరమైన లోపం కాకపోవచ్చు). దురుద్దేశ్యాన్ని దాచిపెట్టుకోవడానికి ఇటువంటి భాష తప్పనిసరి అయిందేమో).

(ii) గిరిజనేతరుల ప్రయోజనాలకు ఎటువంటి ఆటంకం కలిగించకుండా గిరిజనుల హక్కులను కాపాడడానికి ఏ చర్యలు తీసుకోవాలో సూచించడం; (అర్థమయింది కదా? మరయితే వారి ప్రయోజనాలకు ఎంతో కొంత ఆటంకం కలిగించకుండా వీరి హక్కులను కాపాడలేకపోయినట్టయితే ఏం చేయాలి అన్న సందేహం మీకు రావచ్చు. తొందరపడవద్దు. జవాబు దిగువ లభిస్తుంది).

(iii) ఇతర రాష్ట్రాల ఏజెన్సీ ప్రాంతాలలో అమలులో వున్న చట్టాలను మన రాష్ట్రంలో అనుసరించడం సాధ్యమేమో పరిశీలించడం; (దీని లక్ష్యం ఇతర రాష్ట్రాలలో ఆదివాసులకేమైనా ఎక్కువ హక్కులు దక్కుతుంటే వాటిని మన రాష్ట్రంలోని ఆదివాసులకు కూడా ఇవ్వాలని కాదు. రెగ్యులేషన్ 1/70లోని కొన్ని కఠినమైన నియమాలు వేరే ఏ రాష్ట్రంలోనూ లేవని చూపించి వాటిని తొలగించాలని సూచించడం. ఈ సంగతి కూడా దిగువ స్పష్టమవుతుంది).

సభాసంఘం పరిశీలన ఏ కోణం నుండి జరగాలో పరిశీలనాంశాల రూపకల్పనలోనే వెల్లడి చేసుకొని బయలుదేరిన సభాసంఘం దానికి తగిన రిపోర్టునే శాసనసభకు 1999 జూలై 21న సమర్పించింది. ఆ తరువాత సభ రద్దయి ఎన్నికలు జరిగాయి. ఈ రిపోర్టు త్వరలోనే కొత్త శాసన సభలో చర్చకు రావచ్చు.

ఈ రిపోర్టు వల్ల వెంటనే ఏదైనా మార్పు వచ్చేస్తుందని భయపడవలసిన పని లేదు. సమాజంలో ఎవరికైనా ఉన్నట్టే శాసనసభ్యులకు కూడా వివిధ సామాజిక అంశాలపైన కమిటీలు నియమించి, విషయాన్ని పరిశీలించి, నివేదికలు తయారుచేసే హక్కు ఉంది. అంతకు మించి చట్టంలో ఈ నివేదికకు వేరే ప్రాముఖ్యమేమీ లేదు. అయితే ఈ నివేదిక తయారు చేసినవారు భిన్న రాజకీయ పార్టీలకు చెందిన శాసనసభ్యులు కాబట్టి, శాసనసభ్యులకు ఇవాళా రేపూ పార్టీ అభిప్రాయాలే తప్ప సొంత అభిప్రాయాలు ఉండటం లేదు కాబట్టి, మన భాగ్య విధాతల భవిష్యత్ అజెండాను సూచించే పత్రంగా దీనికి రాజకీయ ప్రాముఖ్యం ఉంది. అయినప్పటికీ ఈ నివేదికలోని సూచనలు చట్టరూపం పొందాలంటే ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌ను సంప్రదించాలి, జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌ను సంప్రదించాలి, ఆ పైన రాష్ట్రపతి ఆమోదం పొందాలి. కాబట్టి ఇప్పుడిప్పుడే ఏదో జరిగిపోతుందని భయపడిపోవలసిన అవసరం లేదని గుర్తిస్తూ కూడా ఈ నివేదికలోని దురుద్దేశాన్నీ పాక్షిక వైఖరినీ ఎండగట్టడం అవసరం, చర్చించడం అవసరం. ఈ సభాసంఘంలోని 21 సభ్యులలో సిపిఐ(ఎం), కాంగ్రెస్ (ఐ)లకు చెందినవారు నివేదికతో విభేదించారు. కానీ ప్రస్తుతం రాష్ట్రాన్నీ దేశాన్నీ ఏలుతున్న తెలుగుదేశం, బిజెపి సభ్యులు సమర్థించారు కాబట్టి వారి అసమ్మతి వల్ల దీనిని చర్చించే అవసరం తగ్గలేదు.

మన రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతం తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలలో ఉంది. శ్రీకాకుళం,

విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమగోదావరి, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలలో ఉంది. '1/70' చట్టం అని పిలవబడే ఆం.ప్ర. షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టం ఈ ఏజెన్సీ ప్రాంతానికి మాత్రమే వర్తిస్తుంది. కొన్ని ఇతర రాష్ట్రాలలోని (ఒరిస్సా, కేరళ, మహారాష్ట్ర) భూమి బదలాయింపు చట్టాలు రాష్ట్రమంతటికీ వర్తిస్తాయి. ( ఈ విషయంలో మాత్రం ఇతర రాష్ట్రాలను అనుసరించాలని మన శాసనసభ్యులు అనుకోలేదని దిగువ చూద్దాం).

ఈ చట్టానికి మూలం 1916లో అప్పటి బ్రిటిష్ పాలకులు ఆంధ్రప్రాంత ఏజెన్సీకి వర్తింపజేసిన శాసనంలో ఉంది. 1958లో దానిని ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతాలన్నిటికీ వర్తింపజేస్తూ మన పాలకులు చట్టం చేశారు. 1970లో రెగ్యులేషన్ 1/70 ద్వారా సవరించి మరింత పటిష్టం చేశారు. ఆ చట్టం ద్వారా ఆదివాసులకు మేలంటూ జరిగితే అది '1/70' తరువాతే జరిగిందనేది మొట్టమొదట గుర్తించాలి.

చరిత్రలోకి పోకుండా, ప్రస్తుతమున్న రూపంలో ఈ చట్టం ఏం చెప్తుందంటే, ఏజెన్సీ ప్రాంతాలలో భూమి బదలాయింపు (ఏ రూపంలోనైనా సరే, ఎవరు చేసినా సరే) ఆదివాసుల చేతిలోకే జరగాలి తప్ప ఇతరుల చేతిలోకి జరగడానికి వీలు లేదని. రెండు, ఏజెన్సీలో భూమి కలిగి ఉన్న ఆదివాసేతరులు దానిని ఆదివాసుల నుండి పొందలేదని తామే రుజువు చేసుకోవాలి.

## ముఖ్యమైన రెండిటినీ మార్చాలట!

ఈ రెండు అంశాలనూ సభాసంఘం నివేదిక విమర్శించింది. రెండింటినీ సవరించాలని కోరింది. ఆదివాసుల భూమి ఆదివాసేతరుల చేతిలోకి పోకూడదంటే బాగానే ఉందిగానీ, ఆదివాసేతరులు తమలో తాము కూడా భూమి బదలాయింపు చేసుకోకూడదనడంలో అర్థమేముంది? ఒక రెడ్డి తన భూమిని మరొక చౌదరికి అమ్ముకుంటే కోయలకూ కొండ దొరలకూ జరిగే నష్టమేమిటి? వీళ్లకే అమ్మాలని నియమం పెట్టడం ద్వారా, కొనగల స్తోమత గల ఆదివాసులు లేనిచోట అత్యవసరమైన ఖర్చుల కోసం కూడా (బిడ్డ పెళ్లి, కొడుకు చదువు, వైద్యం ఖర్చు అనే మూడు తరచుగా ప్రస్తావించబడే అత్యవసరమైన ఖర్చులు) ఆదివాసేతరులు భూములు అమ్ముకోలేకపోవడం అన్యాయం కాదా?

ఇది వినగానే ఎవ్వరికైనా అన్యాయమని తోస్తుంది. ఏజెన్సీలోని గిరిజనేతరులు అందరూ పెద్ద సంపన్నులు కారు. సాధారణ రైతులు, ఎస్‌సి బిసి కులాల వారు చాలామంది ఉన్నారు. వాళ్లకు అత్యవసరమైన ఖర్చులు ఉన్నప్పుడు కొంత భూమి అమ్ముకోక తప్పని పరిస్థితి ఉంటుంది. ఆదివాసులకు, లేక ఆదివాసులు సభ్యులుగా ఉన్న సొసైటీకి మాత్రమే అమ్మాలన్న నియమం పెడితే వాళ్లకు ఇబ్బందే. కొనుక్కోగల స్తోమత ఉన్న ఆదివాసులు సాధారణంగా ఉండరు.

మరి దీనికి విరుగుడేమీ లేదా? రెగ్యులేషన్ 1/70 ఒక విరుగుడును చూపించింది. ఆదివాసేతరులెవరైనా భూమి అమ్ముకోదలచుకుంటే ప్రభుత్వం వారి దగ్గర కొనుక్కొని ఆదివాసులకు ఇవ్వాలని ఆ రెగ్యులేషన్ అంటుంది. ఆలస్యం చేయకుండా కొనుగోలు చేయడానికి అవసరమైన నిధుల కేటాయింపు ప్రభుత్వం చేసినట్టయితే ఈ సమస్య తీరుతుందనీ దానికి '1/70'ని సవరించాల్సిన అవసరం లేదనీ ఈ నివేదికతో విభేదించి అసమ్మతి తెలుపుతూ లేఖలు రాసిన కాంగ్రెస్ (ఐ), సిపిఐ (ఎం) సభ్యులన్నారు. సభాసంఘానికి ఈ పరిష్కారం ఎందుకు నచ్చలేదు? ప్రభుత్వం కొనుగోలు చేస్తే సరయిన ధర రాదనుకుంటే ఆ మేరకు మాత్రం సవరించి ప్రభుత్వం

మార్కెట్ ధర చెల్లించాలని గానీ, ఈ కొనుగోలును భూమి సేకరణతో సమానంగా చూడాలనిగానీ అంటే సమస్య తీరదా?

అసలు ఈ నియమమే అక్కరలేదనీ దానివల్ల ఆదివాసులకొచ్చిన ప్రయోజనమేమీ లేదనీ సభాసంఘం నివేదిక అంటుంది. పైకి అదే నిజమనిపించవచ్చు. గిరిజనేతరులు ఒకరి ఆస్తి ఒకరు కొనుక్కుంటే అమ్ముకుంటే గిరిజనులకొచ్చిన నష్టమేముంది? ప్రభుత్వానికే ఎందుకు అమ్మాలి?

పైకి అనవసరమైనవిగా కనిపించే ఈ నియమానికి కొన్ని కారణాలున్నాయి. అన్నిటికంటే ముఖ్యమైనదేమిటంటే, ఇప్పటికే ఏజెన్సీలోని సాగుభూమిలో దాదాపు సగం గిరిజనేతరుల చేతిలో ఉంది. రాబోయే రోజులలో ఆదివాసుల జనాభా పెరిగితే కొత్త తరానికి ఉపాధి కల్పించడానికి ఇప్పుడు ఆదివాసుల చేతిలో ఉన్న భూమి సరిపోదు. గిరిజనేతరుల జనాభా మాత్రం పెరగదా, వాళ్లకు మాత్రం ఉపాధి అక్కరలేదా అంటే రెండు ప్రశ్నలకూ అవుననే అనాలిగానీ, ఏజెన్సీలో బతుకుతున్న గిరిజనేతరులు సహితం ఏజెన్సీ బయట ఉపాధి వెతుక్కోగలరు. ఆస్తులున్నవారు వ్యాపారాలూ ఉద్యోగాలూ వెతుక్కోగలరు, ఏదీ లేని వారు సహితం ఎక్కడో ఒక చోట రిక్షాతొక్కి బతకగలరు. కానీ ఆదివాసులకు ఆ అవకాశం చాలా తక్కువ. వారు ఉపాధి అవకాశాలు ఏజెన్సీలోనే వెతుక్కోవలసి ఉంటుంది. అంటే కాలక్రమంలో గిరిజనేతరుల భూమి కొంతయినా ఆదివాసుల చేతిలోకి పోవలసి ఉంటుంది. దీనికి ఒక మార్గం, భూమి అమ్ముకోదలచుకున్న గిరిజనేతరుల భూమిని ఆదివాసులకే అమ్మాలని లేదా ప్రభుత్వమే దానిని కొనుక్కొని ఆదివాసులకు పంచాలని నియమం పెట్టడం. గిరిజనేతరుల చేతిలోకి వెళ్లిపోయిన భూమిని (అది '1/70'కి విరుద్ధంగా చేతులు మారి ఉంటే తప్ప) ప్రభుత్వం తీసేసుకుని ఆదివాసులకు ఇవ్వలేదుగానీ వారు దానిని అమ్ముకోదలచుకున్నప్పుడు మళ్లీ మరొక గిరిజనేతరుని చేతిలోకి పోకుండా ఆదివాసుల చేతిలోకే పోయేటట్టు చూడడం ఆదివాసుల భూమి సమస్యను పరిష్కరించడానికి మార్గం కాగలదు.

ఏజెన్సీలో భూములున్న గిరిజనేతరులు ఆ భూమిని గిరిజనుల నుండి కొనుక్కోలేదని తామే రుజువు చేసుకోవాలన్న నియమాన్ని కూడా సభాసంఘం నివేదిక వ్యతిరేకించిందని చూశాం. ఈ నియమానికి వాళ్లిచ్చిన వ్యాఖ్యానమేమిటంటే, అడవి భూమి అంతా ఆదివాసులదే కాబట్టి అది ఇతరుల చేతిలో ఉందంటే వారు దానిని ఆదివాసీల నుండే పొంది ఉంటారని చట్టం భావిస్తుందని.

## గ్లాస్‌ఫర్డ్ కథాకమామిషు

ఆ నియమాన్ని ఈ విధంగా వ్యాఖ్యానించిన సభాసంఘం దానికి జవాబుగా, ఏజెన్సీలో ఈ రోజే కాదు ఎప్పటి నుండో గిరిజనేతరులు సహితం ఉన్నారని రుజువు చేయడానికి పూనుకుంది. దీనికి కెప్టెన్ గ్లాస్‌ఫర్డ్ అనే ఆంగ్లేయుడు 1862లో బ్రిటిష్ ప్రభుత్వానికి సమర్పించిన ఒక నివేదిక పనికొచ్చింది. అప్పటికి ఏజెన్సీ అనే చట్టపరమైన భావన లేదు, ఏజెన్సీ చట్టాలు లేవు. కెప్టెన్ గ్లాస్‌ఫర్డ్ గిరిజన - గిరిజనేతర సంబంధాల గురించి ఆ నివేదిక రాయలేదు. ఆయన భద్రాచలం నుండి సిరోంచ దాకా గోదావరి నది రెండు వైపులా ఉన్న అటవీ ప్రాంతంలోని సామాజిక వర్గాల గురించి పరిశీలనాత్మకమైన నివేదిక తయారు చేసినట్టున్నాడు. అందులో, అన్ని కులాలు/ తెగల కంటే కోయ, గొత్తి కోయలు జనాభాలో ఎక్కువ శాతం ఉన్నారని చెప్తూ, అదే సమయంలో వివిధ హైందవ కులాలూ దళితులూ కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారన్నాడు.

సిపిఐ (ఎం) శాసనసభ్యులు తమ అసమ్మతి లేఖలో చెప్పినట్టు, కెప్టెన్ గ్లాస్‌ఫర్డ్ తన నివేదికలో భూమి యాజమాన్యం గురించి ఎక్కడా మాట్లాడలేదు. వివిధ గిరిజనేతర కులాలున్నాయని

అన్నాడుగానీ వారి చేతిలో భూమి ఉందని అనలేదు. పైగా ఆయన ఎగువ గోదావరి ప్రాంతం గురించి రాసింది శ్రీకాకుళం నుండి ఆదిలాబాద్‌దాకా సకల ఏజెన్సీ ప్రాంతాలకూ వర్తిస్తుందా?

అదట్లాగుంచి, ఆదివాసీ ప్రాంతాలలో ఆదివాసేతరులు ఎప్పటి నుండో ఉన్నారని వాదించడానికి ఏదో సందర్భంలో ఏదో ఒక ప్రాంతం గురించి ఎందుకోసమో ఒక ఆంగ్లేయుడు రాసిన నివేదిక చదవలా? మన దేశ చరిత్రలో ఆద్యంతం దాని దాఖలాలు లేవా? 'ఆటవిక తెగలు' నివసించే అటవీ ప్రాంతాలలోకి రైతులను పంపించి గ్రామాలు నెలకొల్పారని మౌర్యుల గురించి చదువుకోలేదా? కౌటిల్యుడు అర్థశాస్త్రంలో చెప్పలేదా? ఇంకా వెనక్కి పోతే రామాయణం కథలో ఉన్నది ఆ సంగతే కదా? 'ఆటవిక తెగలు' లేకపోతే 'రాక్షసులు' నివసించే ప్రాంతాలలోకి ఆర్య నాగరికులు పోవడం, అక్కడ తమ దేవుళ్లకు పూజలూ ప్రార్థనలూ చేపట్టడం, అక్కడి మూలవాసులు వారిపైన దాడులు చేస్తే ఆర్య రాజులూ రాజకుమారులూ పోయి యుద్ధం చేయడం, వాళ్లు ఆర్య స్త్రీలను అపహరించడం, దాని పైన మళ్లీ యుద్ధం జరగడం- చిన్నప్పటి నుండీ ఈ కథ ఎన్నోసార్లు విన్న శాసనసభ్యులు ఆదివాసీ ప్రాంతాలలోకి ఆదివాసేతరులు '1/70' వచ్చేదాకా ఎన్నడూ చొరబడలేదని ఎవరో అన్నట్టు కెప్టెన్ గ్లాస్‌ఫర్డ్ అనే ఆంగ్లేయుడు ఎందుకోసమో రాసిన నివేదిక సపోర్టు ఆశ్రయించడమెందుకు?

అడవంతా ఆదివాసులకే చెందుతుందా అన్న చర్చ పెట్టుకోవడం '1/70'లోని 'రుజువు చేసుకునే బాధ్యత'ను అర్థం చేసుకోవడానికి అక్కరలేదు. అదొక చట్ట సంబంధమైన సాంకేతిక ప్రయోగం. న్యాయస్థానం ముందుకు ఒక వివాదం వచ్చినప్పుడు అందులో తన మాటే నిజమని రుజువు చేసుకునే బాధ్యతను చట్టం ఇరుపక్షాలలో ఒకరి పైన పెడుతుంది. రుజువు చేసుకోలేకపోతే వారు వ్యాజ్యం ఓడిపోతారు. రెండవ పక్షం హక్కే గెలుస్తుంది. నేరస్మృతిలో అభియోగం మోపిన ప్రాసిక్యూషన్ తన అభియోగాన్ని రుజువు చేయాలి. అంతవరకు ముద్దాయిని నిర్దోషిగానే చట్టం భావిస్తుంది. దీని అర్థం ప్రపంచంలో నేరాలేవీ జరగడం లేదని చట్టం భావిస్తుందనీ, ప్రాసిక్యూషన్ రుజువు చేసి చూపించిన నేరాలను మాత్రమే నమ్ముతుందనీ కాదు. ఇది వ్యాజ్య విచారణకు సంబంధించిన ఒక సూత్రం. వాస్తవాల గురించి ఒక అభిప్రాయం కాదు.

'1/70'లోని 'రుజువు చేసుకునే బాధ్యత' కూడా ఇటువంటిదే. మామూలుగా సివిల్ వ్యాజ్యాలలో 'ఫలానా హక్కు నాది' అనిగానీ 'నా హక్కు అతిక్రమించబడింది' అనిగానీ కోర్టుకొచ్చిన వారు ఆ ప్రతిపాదనను రుజువు చేసుకోవలసి ఉంటుంది. అంటే 'రుజువు చేసుకునే బాధ్యత' వారిపైననే ఉంటుంది. '1/70' దీనికొక మినహాయింపు. 'అది మా భూమి. మా చేతి నుండి గిరిజనేతరులు దానిని పొందారు' అని ఆదివాసులు రుజువు చేసుకోనక్కరలేదు. ఆదివాసులు వ్యాజ్యం లేవదీయనక్కరలేదు కూడా. తమ దగ్గరున్న భూమి ఆదివాసుల నుండి పొందినది కాదని 'రుజువు చేసుకునే బాధ్యత' గిరిజనేతరుల పైననే ఉంటోంది. మామూలుగా ఒక పక్షం పైన ఉండే 'రుజువు చేసుకునే బాధ్యత'ను కొన్ని ప్రత్యేక సందర్భాలలో అవతలి వైపుకు బదలాయించడం చట్టంలో కొత్త విషయం కాదు. నేరస్మృతిలో 'రుజువు చేసుకునే బాధ్యత' మామూలుగా ప్రాసిక్యూషన్ పైన ఉంటుందిగానీ రేప్ నేరంలో కొన్ని సందర్భాలలో కొంత మేరకు ఆ బాధ్యత ముద్దాయి మీదికి పోతుంది. స్త్రీల స్థితిగతులలోని బలహీనత వల్ల చట్టం ఈ పాక్షికమైన మార్పు చేసింది. మగవాళ్లంతా రేపిస్టులే కాబట్టి రేప్ చేయలేదని వాళ్లే రుజువు చేసుకోవాలని చట్టం అంటుందని దీనిని వ్యాఖ్యానించడం అర్థరహితమైనట్టే, భూమి సంబంధమైన రికార్డులు సంపాదించడం, వాటి మతలబులు అర్థం చేసుకోవడం ఆదివాసులకు అసాధ్యం కాబట్టి '1/70'

వివాదాలలో 'రుజువు చేసుకునే బాధ్యత'ను చట్టం గిరిజనేతరుల పైన పెట్టడాన్ని అడవి భూమంతా ఆదివాసులదేనని చట్టం అంటున్నదని వ్యాఖ్యానించి, అది నిజంకాదని రుజువు చేయడానికి క్లెప్టెన్ గ్లాస్‌ఫర్డ్‌ను మన శాసనసభ్యులు అరువు తెచ్చుకోవడం అంతే అర్థరహితం. మామూలు సివిల్ వ్యాజ్యాలలాగ 'ఈ భూమి మా పూర్వీకులది' అని కోర్టుకొచ్చే ఆదివాసీయే ఆ విషయాన్ని రుజువు చేసుకోవాలన్న నియమం పెడితే ఏమవుతుందో ఊహించుకోవచ్చు. ఏ ఒక్క వ్యాజ్యమూ ఆదివాసులు గెలవరు. ఇప్పటికే '1/70' కేసులలో దాదాపు సగం గిరిజనేతరులే గెలిచారని మరచిపోరాదు.

సభాసంఘం అభ్యంతరాల పస ఈ పాటిది. అయితే పస ఉన్నా లేకున్నా అసెంబ్లీలో తెలుగు దేశం, బిజెపిలకు సంఖ్యా బలం ఉంది కాబట్టి ఈ అభ్యంతరాలకు ఇంత వివరంగా జవాబు చెప్పాల్సి వచ్చింది. ఈ నివేదిక పర్యవసానంగా ఎటువంటి నష్టమూ జరగకుండా చూసుకోవడం అవసరం. '1/70'లో మార్పు తీసుకురావాలంటే ఈ నివేదిక ప్రతిపాదనలను రాష్ట్ర ఆదివాసీ సలహా మండలి ముందు పెట్టాలి. రాజ్యాంగం అయిదవ షెడ్యూలు ప్రకారం ఆ సలహా మండలిని సంప్రదించకుండా ఏ మార్పూ చేయడానికి వీలు లేదు. ఆ సలహా మండలిలో 3/4 వంతు సభ్యులు ఆదివాసులు (ఆదివాసీ శాసనసభ్యులు, వాళ్లు తక్కువయిన చోట ఇతర ఆదివాసులు) ఉంటారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం ఈ ప్రతిపాదనలను జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు కూడా పంపించవలసి ఉంటుంది. వారి సలహా కూడా తీసుకోవలసి ఉంటుంది. చివరిగా ఏ శాసన సవరణ చేయాలన్నా దానికి రాష్ట్రపతి ఆమోదం కావాలి.

దీని అర్థం ఈ సభాసంఘం నివేదిక వల్ల ఏమీ జరగదు లెమ్మని నిర్లక్ష్యంగా ఉండాలని కాదు. ఒత్తిడి పెట్టడానికి ఒకటికి రెండు అవకాశాలున్నాయని గుర్తించడం మాత్రమే. ఆ ప్రయత్నం మాత్రం త్వరగా చేయాలి. సమర్థంగా చేయాలి.

నిజానికి ఆదివాసుల రక్షణ కోసం చేసిన చట్టాలను మార్చడం సులభం కాదు. కాబట్టే గిరిజనేతరులు ఉన్న చట్టాలు అమలు కాకుండా దౌర్జన్యంగా అడ్డం పడడమే తమ కోరిక తీరే మార్గమని నిర్ణయించుకున్నారు. పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు (కొద్ది ప్రశంసనీయమైన మినహాయింపులతో) వాళ్లకు సహకరిస్తున్నారు.

## ఏజెన్సీలో ఏం జరుగుతోంది?

పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో కొన్నేళ్లుగా జరుగుతున్న ఘటనలు దీనికి నిదర్శనం. గిరిజనేతరులు తమ వ్యూహాలను రూపొందించుకోవడానికి నిజానికి పశ్చిమగోదావరి ఏజెన్సీ చాలా అనుకూలమైన ప్రాంతం. ఆ జిల్లాలో ఏజెన్సీ కొండ ప్రాంతంలో లేదు. మైదానానికి కొనసాగింపుగా ఉంటుంది. అక్కడ గిరిజనేతరుల చొరబాటు సులభం. ఏజెన్సీలోని గిరిజనేతరులకు గిరిజనులతో సఖ్యంగా ఉండకతప్పని పరిస్థితి లేదు. వారి మధ్య కూడిక కూడా సులభం. ఏ సాయంత్రమైనా అన్ని గ్రామాల గిరిజనేతర ముఖ్యులూ జంగారెడ్డి గూడెంలో కలిసి మాట్లాడుకోగలరు. తరచుగా అది జరుగుతున్నది కూడా.

పశ్చిమగోదావరి జిల్లా ఏజెన్సీలో పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి అనే మూడు మండలాలున్నాయి. 1995 నుండి ఇక్కడ ఘర్షణలు జరుగుతున్నాయి. కొంత భాగం 'శక్తి', కొంత సిపిఐ (ఎం), కొంత సిపిఐ (ఎం-ఎల్) (జనశక్తి) ఆదివాసులను సంఘటితం చేస్తున్నప్పటికీ ప్రధానంగా ఆదివాసుల పోరాటాలు 'శక్తి' పనిచేస్తున్న ప్రాంతాలలో ఎక్కువ జరిగాయి కాబట్టి

ప్రభుత్వ యంత్రాంగానికీ గిరిజనేతరులకూ శక్తి సంస్థే విలన్‌గా కనిపిస్తుంది.

ఈ ప్రాంతాలలో ఘర్షణ తీవ్రరూపం తీసుకోవడానికి ఆదివాసులు ఎంచుకున్న పోరాట రూపం కారణం కావచ్చు. గిరిజనేతరుల అనుభవంలో ఉన్న భూమిపైన తాము వివాదం లేవదీసిన చోట, ఆ వివాదం సంతృప్తికరంగా పరిష్కారమయ్యే వరకు గిరిజనేతరులు అందులో ఫలం తీసుకోవడానికి వీలు లేదని వారు అడ్డం పడ్డారు. మామిడి, జీడిమామిడి తోటలున్న భూములలో కాయల్ని వారే తీసుకుపోయిన సంఘటనలున్నాయి.

వాళ్లు దొంగతనంగా తీసుకుపోయిన దానికంటే పోలీసులు పెట్టిన కేసులెక్కువ. మామిడి, జీడిమామిడి తోటలు కాపుకొచ్చే సీజన్‌లో, తాము కోయకుండా ఆదివాసులు అడ్డుకుంటారేమోనని గిరిజనేతరులు 'ముందు జాగ్రత్త'గా వారిపైన పెద్ద సంఖ్యలో కేసులు పెడుతున్నారు. పోలీసులు ఆదివాసీ గూడేల పైన దాడి చేసి వారిని అరెస్టు చేసి ఒక్కొక్కరిని డజన్ల కేసులలో ముద్దాయిలుగా చూపించి జైలుకు పంపుతున్నారు. బెయిలు ఎంత త్వరగా వచ్చినా అన్ని కేసులలో బెయిలు వచ్చే లోపల ఆదివాసేతరులు పంట మొత్తం కోసుకుపోయి ఆదివాసుల పోరాటాన్ని వమ్ము చేస్తున్నారు.

1997 మార్చి నెలలో జీలుగుమిల్లి మండలంలో జరిగిన దాడులలో పోలీసులు 39 మంది స్త్రీలను అరెస్టు చేశారు. వారిలో కొందరిని చాలా కేసులలో ఇరికించారు. పాతచీమలవారి గూడెంకు చెందిన కృష్ణవేణిపైన 18 కేసులు పెట్టారు. మొత్తం 39 మంది స్త్రీలు 32 రోజులు జైలులో ఉన్నారు. వివాదాస్పదమైన భూములలో పంట దొంగిలించారన్నదే వారిపైన అభియోగం. కోర్టుకు ఆధారం చూపించడానికి పోలీసులు, అరెస్టు చేసిన ఆదివాసుల ఇళ్ల నుండే కుంకుడుకాయలు, చింత కాయలు, ధాన్యం ఎత్తుకెళ్లారు.

అదే సంవత్సరం జూన్ 30న పి.రాజవరం గ్రామంలో వివాదగ్రస్తమైన ఒక భూమిలో (అది చెరువు పోరంబోకు అనీ, దానిని సింహాద్రి గోపాలరావు అనే రైతు అక్రమంగా అనుభవిస్తున్నాడనీ ఆదివాసుల అభియోగం) నారుమళ్లు పోయొద్దని .ఆపడానికి ఆ ఊరి గిరిజనులేకాక అనేక ఇతర ఊర్లవాళ్లు కూడా పోయారు. అప్పటికే గిరిజనేతరులు కూడా పెద్ద సంఖ్యలో కొడవళ్లు, గొడ్డళ్లు పట్టుకొని ఘర్షణకు తయారుగా ఉన్నారు. ఇద్దరి మధ్య జరిగిన దొమ్మీలో ఒక గిరిజనేతర రైతు చనిపోయాడు. దొమ్మీ రెండు వైపులా జరిగినా పోలీసులు ఆదివాసులను మాత్రమే అరెస్టు చేశారు. గ్రామాలపైన భీకరమైన దాడులు చేసి మొత్తం 44 మందిని అరెస్టు చేశారు. అందులో 18 మంది స్త్రీలు. గిరిజనేతరుల పైన కూడా పేరుకు కేసు నమోదు చేశారుగానీ ఒక్కరినీ అరెస్టు చేయలేదు.

అప్పట్లో జంగారెడ్డిగూడెం డిఎస్‌పిగా బ్రహ్మారెడ్డి అనే వ్యక్తి ఉండేవాడు. ఆ సంవత్సరం మార్చి, జూలై నెలల్లో జీలుగుమిల్లి మండలం గ్రామాలపైన అతను జరిపిన దాడుల కథ చాలా జుగుప్సాకరమైనది. అంతకు ముందు అతను కర్నూలు జిల్లా ఆత్మకూరు డిఎస్‌పిగా పని చేశాడు. అక్కడ రైతుకూలీ సంఘానికి చెందిన దళిత స్త్రీలతోనూ ఇక్కడ ఆదివాసీ స్త్రీలతోనూ అతని ప్రవర్తన ఎంత హేయమైనదంటే అది స్థానిక పెత్తందార్ల ప్రయోజనాలను కాపాడే ప్రయాసలో భాగం కాకపోతే ప్రభుత్వం కూడా సహించేది కాదు.

ఆదివాసీ స్త్రీలను 'కోయ లంజ' అని తప్ప అతను సంబోధించడు. మాటిమాటికీ రేప్ చేస్తానని బెదిరిస్తాడు. దాదాపు ప్రతి గూడెంలోనూ అతని గురించి ఈ రకమైన ఫిర్యాదే వినపడింది. అయినప్పటికీ కొంత కాలం తరువాత బదిలీ చేయడం తప్ప ప్రభుత్వం అతని పైన ఏ చర్యా

తీసుకోలేదంటే అతను కాపాడుతున్న గిరిజనేతరుల ప్రయోజనాలకున్న రాజకీయ బలం ఎంతటితో అర్థమవుతుంది.

పోలీసులేకాదు, రెవెన్యూ వాళ్లు కూడా అంతే. రెవెన్యూ అధికార్ల పైన ఒత్తిడి పెట్టడానికి గిరిజనేతరులు బలమైన పద్ధతులు అవలంబించారు. రెవెన్యూ అధికారులు గ్రామాలలో అందరి సమక్షంలో రికార్డులు చదవాలనీ ఏ భూమి ఏ కోవకు చెందిందో తెలియజెప్పాలనీ ఆదివాసులు డిమాండ్ చేశారు. గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వభూమిని వెలికి తీయడానికి ఇది సరయిన మార్గం అని వారు భావించారు. కొన్ని చోట్ల రెవెన్యూ అధికారులు ఈ పద్ధతి అవలంబించారు. కానీ దానిని సాగనివ్వకుండా గిరిజనేతరులు అడ్డం పడ్డారు. ఎంఆర్‌వోల కార్యాలయాల బయట ధర్నా చేయడం, రాజమండ్రి - హైద్రాబాద్ రహదారి పైన సుదీర్ఘమైన రాస్తారోకోలు జరిపి కలెక్టర్, ఆర్‌డివోలను రప్పించి వాళ్లను చుట్టుముట్టి ఘెరావ్ చేయడం, గుంపుగా ఎంఆర్‌వో ఆఫీసులలోకి పోయి వాళ్లను దూషించడం చాలాసార్లు జరిగింది. 1996లో జీలుగుమిల్లి ఎంఆర్‌వో ఆఫీసును తగలబెట్టారు, జంగారెడ్డి గూడెం ఎంఆర్‌వో ఆఫీసును ధ్వంసం చేశారు. ఈ రకమైన చర్యల ఫలితంగా, చట్టంలో ఆదివాసులకు ఉన్న హక్కులను అమలు చేసే ఉద్దేశ్యం ఉన్న రెవెన్యూ అధికారులు సైతం భయపడే పరిస్థితి ఏర్పడింది. చాలామందికి ఆ ఉద్దేశ్యం సహితం లేదు.

ప్రతీ గ్రామంలోనూ రెవెన్యూ అధికార్లు ప్రజల సమక్షంలో రెవెన్యూ రికార్డులు చదివి వీలయిన మేరకు భూమి వివాదాలను పరిష్కరించాలని హైకోర్టు 2.1.98న ఇచ్చిన ఆర్డరు ఒకే ఒక్క గ్రామంలో సగం అమలయి ఆగిపోయింది. భూమి వివాదాలలో రెవెన్యూ అధికార్లు జోక్యం చేసుకోకుండా తమకూ పోలీసులకూ వదిలిపెడితే తామే చూసుకుంటామని గిరిజనేతరుల ఒత్తిడి. నాట్ల సమయంలో, పంటకోతల సమయంలో మామిడి, జీడిమామిడి తోటలు కోతకొచ్చే సమయంలో ఆదివాసులపైన ఏవో కేసులు పెట్టించి పోలీసుల చేత అరెస్టు చేయించేస్తే వాళ్లు బెయిలు మీద బయటికొచ్చే లోపల కోతలు ముగించేసుకోవచ్చు. అరెస్టు చేసే క్రమంలో పోలీసులు గ్రామాల పైన బడి దూషించి, తన్ని, ఇళ్లలోని సామాన్లు ధ్వంసం చేసి, డబ్బులెత్తుకుపోయి ఆదివాసులను హింసకు గురి చేస్తే పనిలో పనిగా ఉద్యమ స్థైర్యం కూడా దెబ్బ తీసినట్టవుతుంది. లేకపోయినా, వివాదగ్రస్తమయిన భూములలో గిరిజనేతరులు పంట వేయకుండా, తీసుకోకుండా ఆపడం గిరిజనులు అనుసరిస్తున్న ముఖ్యమైన పోరాట రూపం కాబట్టి 'సరయిన' సమయంలో వారిని అరెస్టు చేయించడం ఆ పోరాటాన్ని విఫలం చేయడానికి పనికొస్తుంది. ఈ ఎత్తుగడ సజావుగా సాగినంత కాలం గిరిజనేతరులకేమీ ఢోకా లేదు. దీనిని సఫలం చేయడం కోసం పోలీసులు వారితో సంపూర్ణంగా సహకరిస్తుండగా, రెవెన్యూ వాళ్లు భూ: వివాదాలను వేరే ఏ రకంగానూ పరిష్కారం చేసే ప్రయత్నం చేయకుండా తమ వంతు సహకారం అందిస్తున్నారు.

ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు, చట్టాలు ఎస్‌సి బిసి కులాలకు చెందిన పేద రైతులకు హాని చేస్తున్నాయన్న అభియోగమొకటి ఉంది. ఆ పేరు మీద '1/70'ని సవరించాలని వాదించేవాళ్లూ ఉన్నారు. కానీ ఇక్కడ మూడు విషయాలు గమనించాలి. ఒకటి, గిరిజనేతరులు ఎంత పేదలైనా ఎస్‌సిబిసి కులాలకు చెందిన వారయినా మైదాన ప్రాంతాలలో బతుకుతెరువు ఏదో ఒక మేరకు సంపాదించుకోగలరు. రెండు, గిరిజనేతర పేదల పట్ల తమకేమీ శత్రుత్వం లేదని ఆదివాసులు ఎవరి ప్రేరణ లేకుండా అనేక సార్లు ప్రకటించారు. ఆదివాసుల పట్ల ఏ మాత్రం సానుభూతి లేని సభాసంఘం నివేదిక కూడా ఈ విషయాన్ని గుర్తించింది. 'ఎస్‌సిలకు, ఇతర భూమి లేని పేదలకు చోటు ఇవ్వడానికి గిరిజనులు సిద్ధంగా ఉన్నారు' అని నివేదిక అనింది.

మూడు, ఆదివాసులకూ ఆదివాసేతర పేదలకూ ఘర్షణ అంటూ జరిగితే అది రెవెన్యూ అధికారుల నిర్వాకం ఫలితమే తప్ప ఆదివాసుల తప్పుకాదు. 1996లో జరిగిన బూసరాజు పల్లి, లక్ష్మీపురం ఘటనలిందుకు నిదర్శనం.

గిరిజనేతరుల పట్టా భూములపైన '1/70' విచారణ జరపడం ఇబ్బందికరం కాబట్టి, ఏజెన్సీలోని ప్రభుత్వ భూములను అనుభవిస్తున్న గిరిజనేతరులను తొలగించి ఆ భూమి ఆదివాసులకు పంచి ఇవ్వడం రాజకీయంగా సులువని రెవెన్యూ అధికారులు భావించి ఆ ప్రయత్నం మొదలుపెట్టారు. గిరిజనేతర పెద్దలకు కూడా అదే నచ్చింది. ఎందుకంటే తమ దగ్గరొక వేళ ప్రభుత్వ భూమి ఉన్నా, దానిని ఇచ్చేసినా ఇంకా పట్టా భూమి ఉంటుంది. దానిని కాపాడుకోవడానికిది పనికొచ్చేటట్టయితే వారికి అభ్యంతరమేమీ లేదు. కాబట్టి ప్రభుత్వ భూమి మొత్తం గిరిజనులకే అప్పగించడానికి తాము సిద్ధమని గిరిజనేతర నాయకులు తరచుగా ప్రకటిస్తున్నారు. నష్టపోయేది ఎవరంటే కేవలం ప్రభుత్వ భూమి ఉన్న గిరిజనేతర పేదలు. ఇది సహజంగానే ఆదివాసులకూ ఎస్‌సి, బిసిలకూ మధ్య ఘర్షణలకు దారి తీసింది.

బూసరాజుపల్లిలో 1967లో 20 మంది దళితులకు 30 లేక 35 ఎకరాల భూమిలో ఇచ్చిన డిఫారం పట్టాలను 1996లో బుట్టాయగూడెం ఎంఆర్‌వో రద్దు చేసి ఆదివాసులకిచ్చాడు. వాళ్లు నాట్లు వేసుకున్నారు. దళితులు ఆగ్రహించి ఆందోళన చేశారు. ఏనాడూ దళితులంటే ప్రేమలేని గిరిజనేతర మోతుబరులు రంగంలోకి దిగి 1996 ఆగస్ట్ 5 పొద్దున్న పెద్ద సంఖ్యలో జనాన్ని పోగు చేసి స్కూటర్లు, మోటార్ సైకిళ్లు, ట్రాక్టర్లలో ఆ నాట్లు పీకడానికి బయలు దేరారు. ఎందుకంటే ఆ ఊరిలో ఈ 30 లేక 35 ఎకరాలే కాక మొత్తం 200 ఎకరాలపైన ఆదివాసులు '1/70' వివాదం లేవదీసి వున్నారు. వాళ్లు వస్తున్న సంగతి తెలిసిన ఆదివాసులు కూడా పెద్ద సంఖ్యలోనే విల్లంబులతో గుమిగూడారు. ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. చర్చలు జరిగాయి. పోలీసులొచ్చి కాపలాగా కూర్చున్నారు. కొవ్వూరు ఆర్‌డివోను పిలిపించి అక్కడికక్కడ ఆ ఊరి భూవివాదాలు పరిష్కరించుకుందామనుకున్నారుగానీ ఆ అధికారి రావడానికి నిరాకరించారు. చివరికి సాయంత్రం ఇరుపక్షాలూ నిష్క్రమిస్తుండగా గిరిజనేతరులలో కొందరు తొడలు కొట్టి ఈలలు వేయగా గిరిజనులు వెనుదిరిగి బాణాలు వేశారు. కర్రలతో కొట్టి గిరిజనేతరులను తరిమారు. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే పరిస్థితిని అదుపులోకి తెచ్చారుగానీ 115 మంది గిరిజనుల పైన కేసు పెట్టారు. నాట్లు పీకడానికి బయలుదేరి వచ్చిన గిరిజనేతరుల చర్య కూడా చట్ట విరుద్ధమేగానీ వాళ్లపైన పోలీసులు ఏ కేసూ పెట్టలేదు.

జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురంలో 20 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిని కొందరు అగ్రకులస్తులు అక్రమంగా అమ్మితే చాలా ఏళ్ల కింద కొనుక్కున్న 20 దళిత కుటుంబాలను ఎంఆర్‌వో తొలగించి ఆ భూమిని ఆదివాసులకు ఇవ్వడం కూడా ఘర్షణకు దారి తీసింది. అదృష్టవశాత్తు భౌతిక దాడులు జరగలేదుగానీ భూమి కోల్పోయిన దళితులు చాలా కాలం ఆందోళన చేశారు. 'ఏజెన్సీ చట్టాలు ఎంత అన్యాయమైనవి' అని ప్రచారం చేయడానికి వారి ఆందోళన పనికొచ్చింది. ఆ ప్రాంతంలో బలిసిన గిరిజనేతర రైతుల భూమి దాదాపు 995 ఎకరాల గురించి ఆదివాసులు లేవదీసిన వివాదం మొత్తం పక్కకు పోయింది.

నిజానికి ఇప్పటిదాకా అక్కడక్కడ కొన్ని సమస్యలున్నా ఏజెన్సీలో ఆదివాసులకూ దళితులకూ మధ్య ఘర్షణ తీవ్రరూపంలో లేదు. దానిని సామాజికంగా పరిష్కరించుకోవడానికి ఆదివాసులు సిద్ధంగా ఉన్నారు. అటువంటప్పుడు ఆ పేరు చెప్పి '1/70'ని సవరించే ప్రయత్నాలు

చేయడం పూర్తిగా అనవసరం. సభాసంఘం నివేదిక నుండి సెలవు తీసుకునే ముందు అందులో కొట్టొచ్చినట్టు కనిపించే పక్షపాత వైఖరి పట్ల నిరసనేకాక కొంత ఆశ్చర్యం కూడా ప్రకటించక తప్పదు. ప్రజాప్రతినిధులు అన్నప్పుడు అందరి ప్రతినిధులూ కాబట్టి మాటవరసకైనా ఆదివాసులకు మేలు చేసే ఒక్క సూచనయినా ఈ నివేదికలో ఉంటుందనుకుంటాం. కానీ నటన కూడా అక్కరలేదని మన శాసనసభ్యులను కుంటున్నారంటే ఆదివాసుల రాజకీయ బలహీనత ఎంతటిదో అర్థం అవుతుంది.

ఈ సంవత్సరం పశ్చిమ గోదావరి జిల్లాలోనూ దాని పొరుగున ఉన్న ఖమ్మంఏజెన్సీలోనూ జరిగిన పోలీసు దాడుల రిపోర్టుతో ఈ వ్యాసాన్ని ముగించడం ఉచితంగా ఉంటుంది.

## ఒకే వ్యక్తి మీద 23 కేసులు

**ఖమ్మం జిల్లా:**

దమ్మపేట మండలంలో ఆదివాసులపైన అక్రమ చొరబాటు, పంట దొంగతనం మొదలయిన అభియోగాలతో మొత్తం 28 కేసులు పెట్టారు. ఈ సంవత్సరం జనవరి 29న కొత్తూరు, మారప్పగూడెం గ్రామాలలో 30 మంది ఆదివాసులను అరెస్టు చేశారు. ఒక్కొక్కరి పైన అనేక కేసులు పెట్టి సులభంగా బెయిలు దొరకకుండా చేశారు. ఈ 28 కేసులు అనేక గ్రామాలకు సంబంధించినవి కాబట్టి ఏ గూడెంలోనయినా ఎప్పుడయినా అరెస్టులు చేయవచ్చునన్న బెదిరింపు దమ్మపేట ఏజెన్సీ పైన ఒక కత్తిలాగా వేళ్లాడుతూ ఉంది.

కొత్తూరుకు చెందిన 'శక్తి' కార్యకర్త, ఆదివాసీ యువకుడు అయిన సోయం చంద్రశేఖర్ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. అతనిని 23 కేసులలో ఇరికించి జనవరి నుండి మే దాకా జైలులో ఉంచారు. ఈ లోపల వివాదగ్రస్తమైన భూమిని సాగు చేసుకోవడానికీ, పంటలూ కాయలూ కోసుకోవడానికీ గిరిజనేతరులకు కావలసిన అవకాశం దొరికింది. ఏ నేరం చేయకుండా 23 కేసులలో ముద్దాయి అయిన ఘనత చంద్రశేఖర్‌కే దక్కిందేమో.

రాష్ట్ర కేబినెట్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వగ్రామం దమ్మపేట మండలంలోని గండుగులపల్లి. ఆ గ్రామంలో వివాదగ్రస్తమైన భూమిలో పంట కోయవద్దని ఆదివాసులు గిరిజనేతర రైతులను ఆపిన నేపథ్యంలో మే 10వ తేదీన పోలీసుల దాడి జరిగింది. దాదాపు 200 మంది సాయుధ పోలీసులు గండుగులపల్లి ఆదివాసీ కాలనీపైన దాడి చేసి నిర్విచక్షణగా ఆదివాసులను చావబాదారు. చాలామంది ఆనాటి దెబ్బల నుండి ఇప్పటికీ కోలుకోలేదు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ రోజు దాకా తన స్వగ్రామంలో ఉన్న ఆదివాసీ బాధితులను కనీసం పరామర్శించడానికి వారి కాలనీకి పోలేదు.

**పశ్చిమగోదావరి జిల్లా:**

జీలుగుమిల్లి, బుట్టాయ గూడెం మండలాలలో ఆదివాసుల అరెస్టులు ముమ్మరంగా సాగాయి. దర్భగూడెం గ్రామ శివారు గిరిజనగూడాలయిన పండువారి గూడెం, చీమల వారి గూడెం, తబస్సివారి గూడెంలలో గత ఏడాది ఫిర్యాదు ఒకటి బయటికి తీసి పోలీసులు 59 మందిని అరెస్టు చేశారు. బుట్టాయగూడెం మండలంలోని తూర్పు రేగుల గుంటలో 16 మందిని, బుచ్చంపేటలో 22 మందిని అరెస్టు చేశారు. వాళ్ల పైన పంట దొంగతనం, అక్రమ చొరబాటు అభియోగాలే కాక తమకు అడ్డంపోయిన గిరిజనేతర రైతులపైన హత్యా ప్రయత్నం చేశారన్న కేసులు కూడా పెట్టారు.

అయితే ఈ అరెస్టులకు అసలు కారణమేమిటంటే ఇది మామిడి, జీడిమామిడి తోటలు కోతకొచ్చే కాలం. ఆదివాసీ ఆందోళనకారులను ఏదో ఒక నెపం మీద జైలులో పడేస్తే వివాదగ్రస్తమైన భూములలో గిరిజనేతరులు కాయలు కోసుకొని పోవచ్చు.

ఈ అరెస్టులు చేసే క్రమంలో పోలీసులు గిరిజన గూడాలపై అర్ధరాత్రి దాడులు చేసి బండబూతులు తిడుతూ జనాన్ని విపరీతంగా కొట్టారు. దర్భగూడెం పంచాయితీలోని గూడాల పైన దాడి చేసిన పోలీసులతో పాటు పోలీసు యూనిఫారంలో గిరిజనేతర యువకులు కూడా వెళ్లారు. లాకప్పులో కూడా గిరిజనేతరులొచ్చి పోలీసుల ప్రోత్సాహంతో గిరిజనులను కొట్టారు.

చీమలవారి గూడెంకు చెందిన ఆదివాసీ యువతి కృష్ణవేణిది చాలా బాధాకరమైన అనుభవం. ఆమెకు ఈ మధ్యనే హిస్టరెక్టమీ ఆపరేషన్ అయింది. పోలీసులు ఆమె కోసం పదేపదే గూడం పైన దాడి చేస్తున్నారు. ఆమెను రేప్ చేస్తానని డిఎస్‌పి బాహాటంగా బెదిరిస్తున్నాడు. గతంలో కూడా అప్పటి జంగారెడ్డిగూడెం డిఎస్‌పి బ్రహ్మారెడ్డి ఆమెను రేప్ చేస్తానని బెదిరించాడు. ప్రస్తుత అనారోగ్య స్థితిలో పోలీసుల చేతికి చిక్కితే ఏమవుతుందోనన్న భయంతో ఆమె పొలాలలో దాక్కొని, ఇంటిలోపలుండి బయట తాళం వేసి బతుకుతూ ఉంది.

గిరిజనులు హింసకు పాల్పడిన ఏకైక సంఘటన ఏజెన్సీకి వెలుపల ఉన్న టి.నర్సాపూర్ మండలంలోని బచ్చులేటిగూడెంలో జరిగిన ఒక గిరిజనేతర రైతు హత్య. ఆ గ్రామంలో 80 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమి గిరిజనేతర రైతుల ఆక్రమణలో ఉందనీ దానిని వెలికి తీసి తమకు పంచాలనీ ఆదివాసీలు ఆందోళన లేవదీశారు. అది ప్రభుత్వ భూమి కాబట్టి ఆ గ్రామం ఏజెన్సీలో లేకున్నా ఈ డిమాండు న్యాయమైనదే. సర్వే జరిపించాలని వారు 1998 నవంబర్‌లో అడిగినప్పుడు టి.నర్సాపూర్ ఎంఆర్‌వో ఒప్పుకొని ఒకసారి సర్వేకోసం గ్రామానికి వచ్చాడుగానీ తరువాత ఏమీ జరగలేదు. రికార్డులు చూపిస్తానని హామీ ఇచ్చాడుగానీ చూపించకపోగా ఇది ఏజెన్సీ కాదు కాబట్టి మీకు అడిగే హక్కు లేదని ఆ తరువాత అన్నాడు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం జనవరి 27న ఈ సమస్యను చర్చించడానికి ఆదివాసులు మీటింగ్ పెట్టుకొని మాట్లాడుకుంటుండగా ఒక గిరిజనేతర రైతు అటువైపు వచ్చి వాళ్లను చూసి తీవ్రంగా దూషించి వాళ్లు ఏదో కుట్ర చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పూర్తిగా అక్రమమైన ఈ కేసులో బెయిలు పొందడానికి వారికి రెండు నెలలు పట్టింది.

బయటికొచ్చిన తరువాత వాళ్లు ఏజెన్సీ గిరిజనుల పోరాట రూపాన్ని బచ్చులేటి గూడెంలో కూడా అమలు చేయాలని చూశారు. వివాదగ్రస్తమైన భూమిలో వివాదం తీరేంత వరకు ఎవ్వరూ సాగు చేయడానికి వీలు లేదన్నారు. ఒక గిరిజనేతర రైతు దీనికి విరుద్ధంగా ఏప్రిల్ నెలలో వడ్లు కోసుకొని పోతుంటే గిరిజనులు అడ్డం పోయారు. ఇరువైపులా జనం మోహరించి దొమ్మికి దిగారు. చాలా మంది గిరిజనులకు గాయాలయ్యాయి. దురదృష్టకరమైన ఈ సంఘటనలో పోలీసులు 22 మంది గిరిజనులను అరెస్టు చేశారు. దొమ్మిలో ఇరువర్గాలూ పాల్గొన్నప్పటికీ ఒక్క గిరిజనేతుడిని కూడా ఇప్పటిదాకా అరెస్టు చేయలేదు.

✦